క్లుప్తంగా

ఆంజనేయస్వామికి నవనీత అలంకారం



నవనీతలంకారంలో ఆంజనేయస్వామి

ముత్తుకూరు: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా స్థానిక వీరాంజనేయస్వామి ఆలయంలో సోమవారం అంజనీ తనయుడు నవనీత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చాడు. ఈ సందర్భంగా విశేష పూజలు, ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహించారు. కాకుటూరు రమేష్‌రెడ్డి, ప్రవీణ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.55,800 విరాళం

కోవూరు: మండలంలోని జొన్నవాడలో కొలువైన కామాక్షితాయి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన కోడూరు సాన్విక రూ.55,800 విరాళాన్ని సోమవారం అందజేశారు. ఈ మొత్తాన్ని నెట్‌బ్యాంకింగ్ ద్వారా ఆలయ ఖాతాకు జమ చేసినట్లు ఈఓ గిరికృష్ణ తెలిపారు. దాతను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నీటమునిగిన వేరుశనగ ఓదెలు

ఉదయగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపల్లి గ్రామంలో గత రెండ్రోజులుగా కురిసిన వర్షానికి చేతికొచ్చిన వేరుశనగ పంట నీటమునిగి రైతన్నకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. గ్రామానికి చెందిన దేవసాని శ్రీనివాసులురెడ్డి తన ఒకటిన్నర ఎకరా పొలంలో సుమారు రూ.40 వేలు ఖర్చు చేసి వేరుశనగ పంట సాగు చేశాడు. పంట కోతదశకు రావడంతో రెండ్రోజుల క్రితం కూలీలతో పంట తీయించి మిషన్ ఆడించేందుకు ఓదెలు పొలంలోనే ఉంచాడు. ఆది, సోమ వారాల్లో కురిసిన వర్షాలకు పొలంలో నీరుచేరి ఓదెలన్నీ నీటమునిగాయి. వ్యవసాయాధికారులు నీట మునిగిన పంటను పరిశీలించి తనకు న్యాయం చేయాలని రైతు కోరుతున్నాడు.

మలేరియా నివారణపై అవగాహన

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సోమవారం మండల వైద్యాధికారిణి ఎం.శివకల్పనారెడ్డి సూచనల మేరకు మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు, ఆరోగ్య బోధకుడు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో మలేరియా నివారణపై సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రధాన కూడళ్లు, దుకాణాల వద్ద డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధుల నివారణపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసులు, రబ్బాని, నాగార్జున, నూర్జహాన్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లలపై ప్రత్యేక దృష్టి

- 18 ఏళ్లలోపు వారికి విద్యనందించడమే లక్ష్యం
- ఇంటింటి సర్వేతో కొత్తగా 12 మంది గుర్తింపు
- మండలంలో 132కు చేరిన దివ్యాంగ పిల్లలు



దివ్యాంగ బాలుడి వివరాలు నమోదు చేసుకుంటున్న ఐఈఆర్టీ

కొడవలూరు: ప్రత్యేకావసరాల పిల్లలపై సమగ్ర శిక్ష అభియాన్(ఎస్ఎస్ఏ) ప్రత్యేక దృష్టి సారించింది. ఇంటింటి సర్వే ద్వారా వారిని గుర్తించి వారికి భవిత కేంద్రం ద్వారా విద్యనందించేందుకు చర్యలు చేపట్టింది. మండలంలో ఇప్పటికే 120 మంది చిన్నారులకు విద్యనందిస్తుండగా, కొత్తగా సర్వే ద్వారా మరో 12 మందిని గుర్తించారు. 18 ఏళ్లలోపు దివ్యాంగ, బుద్ధి మాంద్యం కలిగిన ప్రత్యేకావసరాల పిల్లలు బాహ్య ప్రపంచంలోకి రాకుండా తల్లిదండ్రులపైనే ఆధారపడుతూ ఇంటి వద్దనే మగ్గిపోతున్నారు. ఇలాంటి వారిని గుర్తించి విద్యనందించడం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకునేలా చేయడం, ఇంటికే పరిమితం కాకుండా బాహ్య ప్రపంచంలోనికి స్వేచ్ఛగా రాగలిగేలా చేసి తల్లిదండ్రులకు కొంత ఉపశమనం కలిగించాలని ప్రభుత్వం భావించింది. అందులో భాగంగా భవిత కేంద్రాల ఏర్పాటు చేసి భరోసా కల్పిస్తోంది. ప్రత్యేకావసరాల పిల్లలు సమాజంలో వేసే ప్రతి అడుగుకు మానసిక వైకల్యం అడ్డుగా కాకుండా..మనోస్థైర్యంతో ముందుకెళ్లేలా ప్రత్యేక శిక్షణను అందిస్తోంది. తద్వారా వారి మానసిక, శారీరకంగా ఎదుగుదలకు తోడ్పాటును అందించడంతో పాటు విద్యను అందిస్తూ విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతోంది. అందులో భాగంగానే భవిత కేంద్రంలోని ఐఈఆర్టీలను 40 రోజులపాటు ఇంటింటి సర్వే చేసి ప్రత్యేకావసరాల పిల్లలను గుర్తించాలని ఆదేశించింది. మే 1 నుంచి జూన్ 9వ తేదీ వరకు ఐఈఆర్టీలు గ్రామాల్లో ఇంటింటి సర్వే చేసి ప్రత్యేకావసరాల పిల్లలను గుర్తిస్తున్నారు. మండలంలో ఐఈఆర్టీలు సునీత, హైమావతి ఇంటింటి సర్వే ద్వారా కొత్తగా 12 మందిని గుర్తించారు. ఇప్పటికే మండలంలో 120 మంది ప్రత్యేకావసరాల పిల్లలు భవిత కేంద్రంలో నమోదై ఉన్నారు.

ప్రభుత్వ రాయితీలు

భవిత కేంద్రానికి వచ్చే ప్రత్యేకావసరాల పిల్లలకు రవాణా చార్జీల కింద నెలకు రూ.300 చొప్పున అందజేస్తారు. వారి సహాయకులకు రూ.250 ఇస్తారు. బాలికలైతే అదనంగా మరో రూ.250 ఉపకారవేతనంగా ఇస్తారు. కేంద్రానికి రాలేని వారుంటే వారికి ఇంటి వద్దే విద్యాబుద్ధులు నేర్పడంతో పాటు నెలకు రూ.300 ఇస్తారు. ప్రతి ఒక్కరికీ పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, బూట్లు, మధ్యాహ్న భోజనం, తదితర వసతులు కల్పిస్తారు. సులువుగా నేర్చుకునేలా ఉపకరణాలను అందిస్తారు. వినికిడి, దృష్టి లోపం ఉన్న వారికైతే ఉచితంగా ట్యాబ్‌లు ఇస్తారు. 9, 10 తరగతుల విద్యార్థులైతే జాతీయ ఉపకార వేతనం కింద ఏటా రూ.9 వేల నుంచి రూ.11 వేల వరకు ఉపకారవేతనం అందజేస్తారు. వైకల్యం అధికంగా ఉన్న వారికైతే సదరం సర్టిఫికెట్ ఇప్పించి సామాజిక పింఛన్‌ను మంజూరు చేయిస్తారు. మండలంలో 73 మంది దివ్యాంగ విద్యార్థులు సామాజిక పింఛన్‌ను పొందుతున్నారు.

మూడు దశల్లో సర్వే



అంగన్‌వాడీ కేంద్రం పంచాయతీ, గ్రామ సచివాలయం పరిధిల్లో ఇంటింటి సర్వే విస్తృతంగా చేపడుతున్నాం. ప్రత్యేకావసరాల పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, విద్యనభ్యసించడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేస్తున్నాం. దీంతో తల్లిదండ్రులు పిల్లలను కేంద్రానికి పంపేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. సర్వే ద్వారా మండలంలో కొత్తగా 12 మందిని గుర్తించాం.

– ఎం.సునీత, ఐఈఆర్టీ, భవిత కేంద్రం, కొడవలూరు

బృహత్తర కార్యక్రమం



సమగ్ర శిక్ష అభియాన్ వారు ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు చేపట్టిన సర్వే బృహత్తర కార్యక్రమం. ప్రభుత్వం ప్రత్యేకావసరాల పిల్లలకు అందిస్తున్న రాయితీలపై తల్లిదండ్రుల్లో అవగాహన లేకపోవడంతో వారిని ఇంటికే పరిమితం చేస్తున్నారు. దీనివల్ల పిల్లలు జీవిత కాలం తల్లిదండ్రుల సంరక్షణలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఇలాంటి వారిని సర్వే ద్వారా గుర్తించి ప్రభుత్వ రాయితీలందించి విద్యాబుద్ధులు నేర్పడం ద్వారా మంచి పౌరులుగా ఎదిగే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులకు భారంగా పరిణమించకుండా స్వతంత్రగా జీవించగలిగే సామర్థ్యం పెంపొందుతుంది.

– వసంతకుమారి, ఎంఈఓ, కొడవలూరు

కౌంటింగ్‌పై సర్వత్రా ఉత్కంఠ

పొదలకూరు : సార్వత్రిక ఎన్నికల్లో ఆఖరి ఘట్టమైన కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం జరగనుంది. ఈ నేపథ్యంలో సర్వేపల్లి అసెంబ్లీ ఫలితంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సర్వేపల్లి స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బరిలో నిలిచారు. గత నెల 13న పోలింగ్ జరిగింది. సర్వేపల్లి నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో 2, 32,011 మంది ఓటర్లు ఉండగా, 1,94,613 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సర్వేపల్లి ఫలితంపై ఇప్పటికే రూ.కోట్లలో బెట్టింగులు జరిగాయి. చివరిరోజైన సోమవారం కూడా కొందరు పొదలకూరులో గెలపోటములపై బెట్టింగులకు పాల్పడ్డారు. దీంతో ఎక్కడ నలుగురు చేరినా సర్వేపల్లి కౌంటింగ్‌పై చర్చించుకోవడం కనిపించింది. సర్వేపల్లి ఫలితం త్వరగా వెలువడే అవకాశం ఉంది. సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 284 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 14 టేబుళ్లపై 21 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు. ముందుగా 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లను లెక్కించనున్నారు. ఆ తరువాత ఈవీఎంలో నిక్షిప్తమై ఉన్న ఓట్లను లెక్కించడం జరుగుతుంది. ఉదయం 11 గంటలకు ఫలితాలపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ముందుగా పొదలకూరు మండలం సూరాయపాళెం పోలింగ్ బూత్ నుంచి ఈవీఎంల లెక్కింపును ప్రారంభించనున్నారు. మండలానికి సంబంధించిన నాలుగు రౌండ్లలోనే సర్వేపల్లి అభ్యర్థి భవితవ్యం తేలిపోయే అవకాశం ఉంటుందని నాయకులు భావిస్తున్నారు. రౌండ్ రౌండ్‌కు ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. సాయంత్రం 5 గంటలోపు తుది ఫలితాన్ని వెల్లడించే అవకాశం ఉంటుంది.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై అజయ్‌కుమార్

మనుబోలు: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా పోలీసు నిబంధనలను ఎవరైనా అతిక్రమించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై అజయ్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ఈ నెల 6వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ 30, 144 సెక్షన్ అమల్లో ఉంటాయని తెలిపారు. ప్రజలు గుంపులుగా చేరడం, సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించడం, బాణసంచ కాల్చడం నిషిద్ధమన్నారు. బద్దెవోలు చెక్‌పోస్టు వద్ద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామన్నారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు బయట వ్యక్తులకు అద్దె గదులు ఇవ్వొద్దని మనుబోలులోని లాడ్జిలు, ఫంక్షన్ హాళ్ల యజమానులకు సూచించామని తెలిపారు. సమస్యాత్మక గ్రామమైన కొమ్మలపూడిలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కేసుల్లో ఉన్న వారిని ముందస్తుగా బైండోవర్ చేశామన్నారు. గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు జరిగితే వెంటనే స్పందించేందుకు క్విక్ రియాక్షన్ టీంలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ ప్రశాంతంగా ఉండి శాంతిభద్రతల విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు.

వైభవంగా అభయాంజనేయుని గ్రామోత్సవం



ఆంజనేయుని గ్రామోత్సవం



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

మనుబోలు: హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని యాచవరంలో అభయాంజనేయస్వామి గ్రామోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తొలుత అభయాంజనేయస్వామి ఆలయంలో అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో హనుమంతుడికి క్షీర, పంచామృతాభిషేకాలు, నాగవల్లి దళార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మనుబోలులోని పద్మావతి సూపర్ మార్కెట్ అధినేత యనమల అంకయ్య గ్రామోత్సవానికి ప్రత్యేక ట్రాలీని తయారు చేయించి ఉత్సవ కమిటీకి అందజేశారు. అనంతరం హనుమంతుని ప్రత్యేకంగా అలంకరించి ఐరావతం వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కొబ్బరి కాయలు, పండ్లు నైవేద్యంగా సమర్పించి స్వామి వారికి మంగళ హారతులు పట్టారు. దీంతో హనుమజ్జయంతి ఉత్సవాలు ముగిశాయి

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఇంటి వద్దకే వైద్యసేవలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

కొడవలూరు: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలందుతున్నాయని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి బాలచంద్రబాబు తెలిపారు. కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గుండాలమ్మపాళెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఇద్దరికి ఇంటి వద్దకే వెళ్లి వైద్యపరీక్షలు చేసి వైద్య సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖ అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ పేదల పాలిట బృహత్తర కార్యక్రమమని అభివర్ణించారు. ఆరోగ్య సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి పరిష్కరించేందుకు వెసులుబాటు కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఏ షఫీఉద్దీన్, ఏఎన్ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

పొదలకూరులో దుకాణాల మూసివేత

పొదలకూరు : పట్టణంలోని దుకాణాలను సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం సాయంత్రం వరకు పోలీసులు మూసివేయించారు. అత్యవసరమైన మందుల షాపులను తప్పించి మిగిలిన అన్ని రకాల వ్యాపార సంస్థలను మూసివేయాల్సిందిగా సీఐ ఆర్ రాంబాబు ఆదేశించారు. పట్టణంలో శాంతిభద్రతలపైన పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో 144 సెక్షన్ అమల్లో ఉన్నందున నలుగురు వ్యక్తులు గుంపులుగా చేరి రాజకీయ చర్చలు చేపట్టరాదన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్పించేందుకు ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ర్యాలీలు, సంబరాలు, బాణసంచా కాల్చడానికి అనుమతి లేదన్నారు. ఈ నిబంధనలు మంగళవారం అర్ధరాత్రి 12 గంటల వరకు అమల్లో ఉంటాయన్నారు. వ్యాపారులు పోలీసులకు సహకరించాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

కోవూరు: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మంగళవారం కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో ఎవరైనా నిబంధనలు అతిక్రమించి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని బుచ్చిరెడ్డిపాళెం సీఐ హైమారావు హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. సోషల్ మీడియా వేదికగా ఎలాంటి వివాదస్పద పోస్టులు పెట్టవద్దన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కనులపండువగా శ్రీవారికి పుష్పయాగం



పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు



108 కలశాలతో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి శ్రీవారి పుష్పయాగాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. దేవతోద్వాసన, మహాపూర్ణాహుతి, ధ్వజావరోహణం, సప్తాదరణ, రుత్విక్‌సమ్మానం, తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయకర్తలుగా అన్నం లక్ష్మీనారాయణ,లక్ష్మీ దంపతులు వ్యవహరించారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం బ్రహ్మాండ నాయకునికి 108 కలశాలతో ఉత్సవందస్నపం నిర్వహించారు. శ్రీవారి మహిళా భక్తులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: మోటార్ బైక్‌ను ఆటో ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కసుమూరులో సోమవారం జరిగింది. నెల్లూరులోని కొత్తూరు ప్రాంతానికి చెందిన ఖాదర్‌మొహిద్దీన్ పని నిమిత్తం మోటార్‌బైక్‌పై కసుమూరుకు వచ్చాడు. తిరిగి కొత్తూరుకు వెళుతుండగా, పొలిచెర్లపాడు క్రాస్‌రోడ్డు వద్ద మోటారు బైక్‌ను ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఖాదర్‌మొహిద్దీన్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

వేసవి విజ్ఞాన శిబిరం



పేపర్ క్రాఫ్ట్స్ సాధన చేస్తున్న చిన్నారులు

కొడవలూరు: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కొడవలూరు గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులతో నీతి కథలు చెప్పించడంతో పాటు కఠినమైన తెలుగు పదాలు, పేపర్ క్రాఫ్ట్స్ సాధన చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంతో విద్యార్థులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు. క్రమం తప్పకుండా శిబిరానికి రావడం వల్ల విజ్ఞానం, నైతిక విలువలు పెంపొందడంతో పాటు క్రీడలు, చిత్ర లేఖనం, తెలుగు భాషలో నైపుణ్యం పెరుగుతుందన్నారు. ఈ నెల 7వ తేదీ వరకు జరిగే శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

సంగం: స్థానిక శ్రీరామచంద్రాపురం రామాలయంలో హనుమాన్ జన్మోత్సవాల్లో భాగంగా సోమవారం సీతారాముల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను పరిమళ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి విశేష పూజలు చేశారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్ల కణోత్సవాన్ని తిలకించి తరించారు.



తొలకరి చినుకుల్లో గొడుగు వేసుకుని వెళ్తున్న వాహనదారుడు



కారులో వెళ్తూ వర్షాన్ని ఆస్వాదిస్తున్న చిన్నారి



వర్షపు చినుకుల్లో తడుస్తూ వెళ్తున్న నగర ప్రజలు

తొలకరి పలకరింత..జనం పులకింత

నగరాన్ని తొలకరి పలకరించడంతో జనం పులకించారు. నైరుతి రుతుపవనాల ఆగమనంతో సోమవారం ఉదయం నుంచి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. ఆకాశం మేఘావృతమై తొలకరి చినుకులు పలుకరించాయి. దీంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో రెండు నెలలుగా ఎండలతో అల్లాడుతున్న నగర ప్రజలు చల్లటి గాలులను ఆస్వాదిస్తూ తమ తమ పనులకు వెళ్తూ కనిపించారు. ఎండలకు ఇళ్లకే పరిమితమైన చిన్నారులు బయటకొచ్చి ఆటల్లో మునిగితేలారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



వాతావరణం చల్లబడడంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చి ఆటల్లో నిమగ్నమైన చిన్నారులు

